ధర్నాలో మాట్లాడుతున్న చుక్క రాములు

అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సిందే

- ప్రభుత్వాలు మారినా ప్రజల జీవితాల్లో మార్పు లేదు
- ప్రజాపాలనంటున్న రేవంత్ సర్కారులో ప్రజా సమస్యల పరిష్కారమేది..?
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సిందేనని, ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వ భూముల్లోకి పేదలను తీసుకెళ్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. గురువారం సిపిఎం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని ఆపార్టీ జిల్లా కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిఆర్‌ఒకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనేకేళ్లుగా పేదలు ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. రాష్ట్రంలో పాలకులు మారినా ప్రజల బతుకులు మారడం లేదన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుంటే ప్రభుత్వ స్థలాల్లో ఎర్రజెండాలు పాతి పేదలకు ఆ భూములను పంచుతామని స్పష్టంచేశారు. ప్రజా పాలన అంటున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏ ఒక్క ప్రజా సమస్యను కూడా పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ అందాల పోటీలే ముఖ్యమైనట్టుగా ఈ ప్రభుత్వం వ్యవహరించడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు కావస్తున్నా ఏ ఒక్క సంక్షేమ పథకం పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేని అనేక మంది పేదలు ఇండ్ల స్థలాల కోసం సంగారెడ్డి, కంది, సదాశివపేట, జహీరాబాద్, పటాన్‌చెరులో తాత్కాలిక గుడిసెలు నిర్మించుకున్నారని, వాటిని ప్రభుత్వ అధికారులు కూల్చేశారని ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించి వారికి తక్షణమే ఇళ్ల పట్టాలతో పాటు గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఇండ్ల స్థలాల కోసం పోరాడుతున్న పేదలందరినీ కలుపుకొని రానున్న రోజుల్లో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు మాట్లాడుతూ.. ఇండ్ల స్థలాల సమస్యపై సిపిఎం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. అధికారులు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు పెట్టుకున్న పేదలందరికీ పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని తెలిపారు. రాజీవ్ గృహకల్ప లబ్దిదారులకు ఇళ్లు పూర్తి చేసి అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, రాజయ్య, మాణిక్, సాయిలు, నర్సింలు, నాయకులు యాదగిరి, ప్రవీణ్, నాగేశ్వర్‌రావు, కృష్ణ, అశోక్, రాజయ్య, శ్రీనివాస్, రమేష్ గౌడ్, సలీం, రాజేష్, మహేష్, అర్జున్, వివిధ ప్రాంతాల నుంచి పేదలు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో గణేష్ హౌసింగ్ రోడ్‌షో

హైదరాబాద్ : గుజరాత్ ఐటి, ఐటిఇఎస్ పాలసీ 2022-27 కోసం గుజరాత్ ప్రభుత్వం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ భాగస్వామ్యంతో గణేష్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ తమ మూడవ రోడ్‌షోను హైదరాబాద్‌లో నిర్వహించినట్లు తెలిపింది. అసోచామ్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా 200 పైగా కంపెనీలు హాజరయ్యాయని పేర్కొంది. ఈ రోడ్ షోలో గణేష్ హౌసింగ్‌కి చెందిన ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్, మిలియన్ మైండ్స్ టెక్ సిటీని హైదరాబాద్ టెక్ నెట్‌వర్క్‌కు పరిచయం చేసినట్లు ఆ సంస్థ డైరెక్టర్ అన్మోల్ పటేల్ తెలిపారు.

పేదల పట్ల సానుభూతి చూపాలి

- పెద్దల విషయంలో కఠినంగా వ్యవహరించాలి
- హైడ్రా అధికారులకు సిఎం సూచన
- వారసత్వ సంపదను రక్షిస్తూ హైదరాబాద్‌ను పునరుద్ధరిద్దాం : సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేదల పట్ల మానవీయ కోణంతో, సానుభూతితో వ్యవహరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. చెరువులు,నాలాలు, ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న పెద్దల విషయంలో కఠినంగా వ్యవహరించాలని హైడ్రా అధికారులకు సిఎం స్పష్టంచేశారు.

హైడ్రా అంటే కేవలం కూల్చివేతలే కాదు...వర్షాల సమయంలో రోడ్డుపై నీరు నిలవకుండా చూడటం, విద్యుత్ పునరుద్ధరణ, జరిగేలా, ట్రాఫిక్ స్ట్రీమ్ లైన్ చేసే బాధ్యతను కూడా హైడ్రా చూసుకుంటోందని సిఎం చెప్పారు. గురువారం హైదరాబాద్‌లో హైడ్రా పోలీస్ స్టేషన్‌తో పాటు వాహనాలను సిఎం ప్రారంభించారు. హైడ్రా వెబ్‌సైట్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా సిఎం మాట్లాడుతూ,

ప్రభుత్వం ఒక మంచి ఆలోచనతో చారిత్రక నగరం హైదరాబాద్ పరిరక్షణకు హైడ్రా ఏర్పాటు చేసిందన్నారు. "1908 లో వచ్చిన వరదల నివారణకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య ద్వారా ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ లను నిజాం నిర్మించారు. బెంగుళూరులో చెరువులను పరిరక్షించుకోకపోవడంతో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. వర్షాలకు ముంబై, చెన్నై వరదలతో సతమతమవుతున్నది.

కాలుష్యాన్ని నియంత్రించకపోవడంతో ఢిల్లీలో పార్లమెంట్

నుంచి పాఠశాల వరకు సెలవులు ప్రకటిస్తున్న పరిస్థితి నెలకొంది. మెట్రో నగరాలు నివసించడానికి యోగ్యం కాని నగరాలుగా మారుతున్నాయి. ప్రకృతిని కాపాడుకోకపోతే హైదరాబాద్ లోనూ ఇలాంటి పరిస్థితులే ఎదురవుతాయి

అందుకే ఎవరేం అనుకున్నా హైడ్రాను తీసుకొచ్చాం. చెరువులు ఆక్రమిస్తే ఎంతటివారినైనా హైడ్రా ఉపేక్షించదు. హైదరాబాద్ నగరంలో చెరువులు, నాలాలు ఆక్రమణలకు గురయ్యాయి. కొందరు రోడ్లను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారు. చెరువులు, నాలాలను, మూసీని ఆక్రమించుకున్న వారికే హైడ్రా అంటే కోపం. అలాంటి కొంతమంది వ్యతిరేకించినా ప్రజలకోసం ముందుకెళతాం. ఆక్రమణలు తొలగిస్తుంటే రియల్ ఎస్టేట్ పడిపోతుందని కొంతమంది మాట్లాడుతున్నారు. అసలు మీ బాధ ఏంది?

కడుపు నిండా విషం నింపుకుని ప్రభుత్వాన్ని ముందుకు వెళ్లనివ్వకుండా చేస్తున్నారు.. ప్రజలకు మేలు జరగొద్దని చూస్తున్నారు..గుజరాత్ లో సబర్మతి, యూపీలో గంగా నది, ఢిల్లీలో యమునా నదిని ప్రక్షాళన చేసుకుంటున్నారు. కానీ ఇక్కడ మూసీని పునరుద్ధరణ చేస్తామంటే అడ్డుకుంటున్నారు

బిజెపి నాయకులు చేస్తే కరెక్టు.. తెలంగాణలో కాంగ్రెస్ చేస్తే తప్పా..?

ప్రజలకు మేలు జరిగే పనులను అడ్డుకోవద్దు.. వారసత్వ సంపదను కాపాడుకుని హైదరాబాద్ నగరాన్ని పునరుద్ధరించుకుందాం..." అని సిఎం అన్నారు.కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పార్టీలు...సిద్ధాంతాలు వేరైనా.. దేశ కోసం ఒక్కటవుతాం

రాజకీయ పార్టీలు.. వాటి సిద్ధాంతాలు వేరైనా... దేశ రక్షణ కోసం అందరం ఒక్కటవుదామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. దేశం వైపు కన్నెత్తి చూస్తే వారికి భూమిపై నూకలు చెల్లుతాయని హెచ్చరించారు. ఉగ్రవాదుల దాడిలో 26 మంది భారతీయులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం, ఆర్మీ చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్'కు ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సంపూర్ణ మద్దతు తెలిపారని గుర్తు చేశారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయం ముందున్న రాజీవ్‌గాంధీ విగ్రహం నుంచి నెక్లెస్‌రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు రాష్ట్ర ప్రభుత్వం జాతీయ సంఘీభావ ర్యాలీని నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు, డిజిపి రవి గుప్తా ర్యాలీలో అగ్రభాగాన నడిచారు. ఈ సందర్భంగా 'జై జవాన్, జై హింద్, వందేమాతరం' నినాదాలతో మార్మోగాయి.

ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి చిత్రపటాలకు సీఎం పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, మాజీ ఆర్మీ అధికారులు, మాజీ సైనికులు, యువకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు.

పేద యువతకు క్వాలిజీల్ ల్యాప్‌టాప్‌ల పంపిణీ

ప్రజాశక్తి - హైదరాబాద్

ఎఐ ఆధారిత ఆధునిక నాణ్యత ఇంజనీరింగ్, డిజిటల్ సొల్యూషన్స్ సంస్థ క్వాలిజీల్ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్‌ఆర్)లో భాగంగా హైదరాబాద్‌లో పేద యువతకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేసినట్లు తెలిపింది. నిర్మాన్ ఆర్గనైజేషన్ భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొంది. ఇది తమ డిజిటల్ సాధికారత నిబద్ధతకు నిదర్శనమని క్వాలిజీల్ సహ వ్యవస్థాపకుడు మధుమూర్తి రోణం పేర్కొన్నారు. యువతలో ఉత్సుకతను రేకెత్తించడం, అవకాశాలను అందించడం, ప్రాథమిక స్థాయి నుండి భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ప్రతిభను ప్రోత్సహించాలని తాము కోరుకుంటున్నామన్నారు.

నోటీసు

XIV Addl. Dristirct Sessions Judge, Vijayawada
G.W.O.P.No. 23 of 2025

Between
శ్రీమతి. షేక్ షామా ఫాతిమా ... పిటీషనర్
మరియు
శ్రీమతి. మేడి సరస్వతి, హైదరాబాదు ... రెస్పాండెంట్

పై నంబరు పిటీషనులో ఇందలి పిటీషరు కుమారుడు, కుమార్తెయిన 1) షేక్ అల్తాఫ్ అహ్మద్ 2) అఫ్రీన్ అన్‌జూమ్‌లకు చెందిన దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని తన మైనరు కుమారుడు, కుమార్తెల తరపున అమ్ముటకుగాను పర్మిషను యిప్పించవలసినదిగా దాఖలు చేసియున్నారు. సదరు పిటీషను ది. 28.05.2025వ తేదీన వాయిదా కలదు. కావునా పైన తెలిపిన విధముగా కోర్టు వారి నుండి పర్మిషను పొందుటలో ఎవ్వరికైననూ, ఎటువంటి అభ్యంతరము లు ఉన్ననూ, వారు ది. 28.05.2025 వ తేది ఉదయం గం.10.30 ని.లకు పై కోర్టు వారి ఎదుట హాజరై వారి అభ్యంతరములు తెలియచేసు కోవచ్చునని ఇందుమూలముగా తెలియ చేయటమైనది. **ఎ-షెడ్యూలు:** పూర్వం రంగారెడ్డి జిల్లా, ప్రస్తుత మేడ్చల్-మల్కాజగిరి జిల్లా, బాలానగర్ మండలం, కూకట్‌పల్లి మునిసిపల్ సర్కిల్, మూసాపేట గ్రామం సర్వే నెం.అ, ఆ మరియూ 8 అ,ఆ,ఇ,ఈ, డోరు.నెం.12-5-123/ఎఫ్-502, (పి.టి.ఐ.నెం. 1141208090)గా గల రెసిడెన్సియల్ అపార్ట్‌మెంట్ నెం.502 గానూ అవిభాజ్యపు భాగము చ.గ.32.0లు లేక 26.75 చ.మీ.లు (1258.0 చ.గ.లు మొత్తంలో) దాఖలా స్థిరాస్థికి **హద్దులు: తూర్పు:** Hyderabad to Bombay road, **దక్షిణం:** H.No. 5-112 belonging to Sri Narayan Patel, **పడమర:** Premises Nos. 5-52/1/C, 5-52/2/C belonging to Neighbours, **ఉత్తరం:** Southern portion of premises No. 5-124 belonging to Sri A.J. Vittal Rao యీ హద్దుల మధ్య చ.గ.1258.0లు స్థిరాస్థి నివేశన స్థలములో అవిభాజ్యపు, అనిర్దిష్టపు జాయింటు హక్కు గల చ.గ. 32.0లు లేక చ.మీ.26.75ర్లు స్థిరాస్థి నివేశన స్థలమున్నూ మరియు **బి-షెడ్యూలు:** పైన తెలిపిన ఎ-షెడ్యూలు దాఖలా మొత్తము స్థలములో S.V. Sai Srinivasam Residency అను పేరుతో నిర్మించియున్న అపార్ట్‌మెంట్‌లోని అయిదవ ఫ్లోరులోని నెం.502 ప్లాటు కట్టడములకు **హద్దులు: తూర్పు:** Lift/Open to Sky **దక్షిణం:** open to Sky, **పడమర:** Staircase / open to Sky, **ఉత్తరం:** Corridor ఈ నాలుగు హద్దుల మధ్య చ.అ.1092.0లు ప్లింతేరియా మరియు పార్కింగు హక్కుతోను సదరు అపార్ట్‌మెంటుకు సంబంధించిన కామన్ కారిడార్, లిఫ్టు, జనరేటర్, కామన్ పార్కింగు, డ్రైనేజీ, కామన్ ఏరియా, కామన్ ఫెసిలిటీస్, జాయింటు దారులు, మోటారు వగైరాలందు మిగిలిన వారితో పాటు జాయింటు హక్కులతో సహా...

(శ్రీ కోర్టు వారి ఆదేశంతో)

సి.యస్.యస్.ఆర్.వేణుగోపాల్, అడ్వకేట్
2వ ఫ్లోరు, 26-20-15, స్వామి వీధి,
విజయవాడ-3
ఫోన్ నెం: 9848234515
తేది: 08-05-2025, విజయవాడ

నాలుగేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు

- భూభారతి చట్టం ఇతర రాష్ట్రాలకు ఆదర్శం
- రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాబోయే నాలుగేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన పేదలకు కట్టించి ఇస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో నిర్మించిన ఇందిరమ్మ నమూనా ఇంటిని గురువారం ప్రారంభించారు. అదే విధంగా ఆపరేషన్ సిందూర్‌కు మద్దతు తెలుపుతూ నకిరేకల్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మొదటి విడతలో ప్రతి నియోజకవర్గానికీ 3500 చొప్పున ఇండ్లు కేటా యించామని, ఇంకా మూడు విడతలుగా ఇళ్లను ఇస్తామని చెప్పారు. భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టం దేశానికే రోల్ మోడల్ కానుందన్నారు. జూన్ 2 నుంచి ప్రతి మండలం, ప్రతి రెవెన్యూ గ్రామానికి తహసీల్దార్ స్థాయి అధికారులు వచ్చి భూ సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. భూభారతిలో పెండింగ్‌లో ఉన్న 926000 (తొమ్మిది లక్షల ఇరవై ఆరు వేలు) సాదాబైనమాల దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారందరికీ పూర్తి హక్కులు కల్పించనున్నామన్నారు. భూభారతిలో నకిరేకల్‌ను పైలెట్ మండలంగా తీసుకున్నామన్నారు. ప్రజా పాలన వచ్చిన తర్వాత రాష్ట్రంలో 650 కోట్లు ఖర్చు చేసి తాత్కాలిక తాగునీటి ఏర్పాట్లు చేశామన్నారు. గడిచిన 15 నెలల్లో వైద్యంపై 11800 కోట్లు ఖర్చు చేస్తే గత ప్రభుత్వం ఏడాదికి 5650 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. 58 నియోజకవర్గాల్లో రూ.11600 కోట్లతో ప్రతి నియోజకవర్గంలోనూ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు కట్టిస్తున్నామన్నారు. స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం కోరిక మేరకు నకిరేకల్ మండలానికి నూతన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు తెలంగాణ ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఉంటుందని మంత్రి తెలిపారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లను పారదర్శకంగా కేటాయిస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలోనూ ఇందిరమ్మ కమిటీ ఏర్పాటు చేసి రెండు వందల ఇళ్లకు ఒక గెజిటెడ్ అధికారిని ఏర్పాటు చేసి సర్వే నిర్వహించిన తర్వాత జాబితా రూపొందించామన్నారు. ఆ జాబితాను ఇన్‌చార్జి

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

మినిస్టర్ ఆమోదంతో లబ్దిదారులకు ఇస్తున్నామన్నారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. నకిరేకల్ నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇండ్లు ఎక్కువగా కేటాయించాలని, తహసీల్దార్ కార్యాలయం నూతన భవనాన్ని మంజూరు చేయాలని, గతంలో ఎస్ఎల్ బిసి కోసం తీసుకున్న భూముల సమస్యను పరిష్కరించాలని మంత్రిని కోరారు. ఇనుపాముల గ్రామంలో ఒకే వ్యక్తిపై 50 నుంచి 100 ఎకరాలు లెక్కించిన దానిని సరి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, శంకర్ నాయక్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, బిసి కార్పొరేషన్ మాజీ చైర్మెన్ శంబయ్య, డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ అమిత్ రెడ్డి, జిల్లా ఎస్‌పి శరత్‌చంద్ర పవార్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్, ఇన్‌చార్జి రెవెన్యూ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, ఆర్‌డిఒ వై అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

12న ఈసెట్ పరీక్ష

- 19,672 మంది దరఖాస్తు
- 86 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బీటెక్, బిఇ, బి ఫార్మసీ, బిఎస్సీ మ్యాథమెటిక్స్ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ద్వితీయ సంవత్సరంలో లాటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశాల కోసం నిర్వహించే ఈసెట్ రాతపరీక్ష ఈనెల 12న ఆన్‌లైన్‌లో జరగనుంది. ఈ మేరకు ఈసెట్ కన్వీనర్ పి చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఈనెల 12న ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షను నిర్వహిస్తామని పేర్కొన్నారు. అదేరోజు ఉదయం 7.30 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతిస్తామని తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల వరకే అభ్యర్థులకు అనుమతి ఉంటుందని వివరించారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. బ్లాక్/బ్లూ బాల్ పాయింట్ పెన్ను, హాల్‌టికెట్, ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డును తెచ్చుకోవాలని సూచించారు. క్యాలిక్యులేటర్లు, మ్యాథమెటికల్/లాగ్ టేబుల్స్, పేజర్లు, సెల్‌ఫోన్లు, డిజిటల్ వాచ్‌లు, పెద్ద కళ్లద్దాలు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు, ఇతర పేపర్లను అనుమతించబోమని తెలిపారు.

LAURUS Labs
Chemistry for Better Living

లారస్ ల్యాబ్స్ లిమిటెడ్
CIN: L24239AP2005PLC047518

నమోదిత కార్యాలయం: లారస్ ఎన్‌క్లేవ్, ప్లాట్ ఆఫీస్ 01, E.బోనంగి గ్రామం, పరవాడ మండలం, అనకాపల్లి జిల్లా-531021, ఆంధ్రప్రదేశ్
కార్పొరేట్ కార్యాలయం: 2వ అంతస్తు, సెరీన్ ఛాంబర్స్, రోడ్ నెం.7, బంజారా హిల్స్, హైదరాబాద్-500034, తెలంగాణ.
టెలిఫోన్: +91 40 3980 4333; **ఫ్యాక్స్:** +91 040 3980 4320,
ఇ-మెయిల్: secretarial@lauruslabs.com; వెబ్‌సైట్: www.lauruslabs.com

ప్రకటన

ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ (ఐఇపిఎఫ్) అథారిటీకు ఈక్విటీ వాటాల బదిలీ

ఇందుమూలంగా వాటాదారులకు తెలియజేయునది ఏమనగా సవరించిన ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ అథారిటీ (అకౌంటింగ్, ఆడిట్, ట్రాన్స్‌ఫర్ అండ్ రీఫండ్) రూల్స్, 2016 ("నియమాల")తో చదవబడే కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 124(6)లోని నిబంధనలకు అనుగుణంగా 2017-18 ఆర్థిక సంవత్సరానికి ప్రకటించిన తుది డివిడెండ్, ఏడేళ్ల పాటు క్లెయిమ్ చేయకుండా ఉండిపోయినవి ఐఇపిఎఫ్ కి బదిలీ చేయబడాలి. డివిడెండ్‌లను వరుసగా ఏడు సంవత్సరాలు క్లెయిమ్ చేయని వాటాదారుల సంబంధిత షేర్లు కూడా నిబంధనలలో పేర్కొన్న విధానం ప్రకారం బదిలీ చేయబడతాయి.

నిబంధనలలో పేర్కొన్న వివిధ అవసరాలకు కట్టుబడి, కంపెనీ వారికి క్లెయిమ్ చేయని డివిడెండ్‌ను క్లెయిమ్ చేయడానికి దరఖాస్తు చేసుకోవాలని సలహా ఇస్తూ ఐఇపిఎఫ్ అథారిటీకి బదిలీ చేయబడే బాధ్యత ఉన్న సంబంధిత వాటాదారులకు వ్యక్తిగత నోటీసుల ద్వారా కంపెనీ తెలియజేసింది.

కంపెనీ తన వెబ్‌సైట్: www.lauruslabs.com లో ఐఇపిఎఫ్ అథారిటీకి బదిలీ చేయడానికి బాధ్యత వహించే వారి డిపిఐడి- క్లయింట్ ఐడితో పాటు సంబంధిత వాటాదారుల పూర్తి వివరాలను అప్‌లోడ్ చేసింది. ఐఇపిఎఫ్ అథారిటీకి బదిలీ చేయబడే బాధ్యత కలిగిన వాటాల వివరాలను ధృవీకరించవలసిందిగా వాటాదారును అభ్యర్థించారు.

సంబంధిత వాటాదారులు దానిని క్లెయిమ్ చేయడంలో విఫలమైతే, వారి ఈక్విటీ షేర్లు ఎటువంటి తదుపరి నోటీసు లేకుండా ఐఇపిఎఫ్ అథారిటీకి బదిలీ చేయబడతాయని గమనించవచ్చు, సదరు బదిలీపై క్లెయిమ్‌చేయని డివిడెండ్ మొత్తానికి సంబంధించి కంపెనీపై ఎటువంటి దావా ఉండదు. క్లెయిమ్ చేయని డివిడెండ్ మరియు ఐఇపిఎఫ్ డీమ్యాట్ ఖాతాకు బదిలీ చేయబడిన షేర్లు రెండింటిని సదరు వాటాలపై సంభవించే అన్ని ప్రయోజనాలతో సహా, ఏదైనా ఉంటే, నిబంధనల ప్రకారం నిర్దేశించిన విధానాన్ని అనుసరించిన తర్వాత ఐఇపిఎఫ్ అథారిటి నుండి వారు తిరిగి క్లెయిమ్ చేయవచ్చు. సదరు ప్రక్రియ మరియు వివరాలు www.iepf.gov.inలో అందుబాటులో ఉన్నాయి.

పై విషయానికి సంబంధించి ఏవైనా సందేహాల కోసం, వాటాదారులు మెసర్స్ కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్, రిజిస్ట్రార్ &ట్రాన్స్‌ఫర్ ఏజెంట్స్, సెలీనియం బిల్డింగ్, టవర్-బి, ప్లాట్ నెం.31 & 32, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నానక్‌రామ్‌గూడ, శేరిలింగంపల్లి, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ-500032 వారిని సంప్రదించవచ్చు. టెలి:+91 40 67162222, ఇ-మెయిల్: einward.ris @kfintech. com లేదా పైన పేర్కొన్న చిరునామా/ ఇమెయిల్/ టెలిఫోన్ నెంబర్‌లో కంపెనీ వారిని సంప్రదించవచ్చు.

లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ కోసం
జి. వెంకటేశ్వర రెడ్డి
కంపెనీ సెక్రటరీ

ప్రదేశం: హైదరాబాద్
తేదీ: 08 మే, 2025

LAURUS Labs
Chemistry for Better Living

లారస్ ల్యాబ్స్ లిమిటెడ్
CIN: L24239AP2005PLC047518

నమోదిత కార్యాలయం: లారస్ ఎన్‌క్లేవ్, ప్లాట్ ఆఫీస్ 01, E.బోనంగి గ్రామం, పరవాడ మండలం, అనకాపల్లి జిల్లా, ఆంధ్రప్రదేశ్-531021
కార్పొరేట్ కార్యాలయం: 2వ అంతస్తు, సెరీన్ ఛాంబర్స్, రోడ్ నెం.7, బంజారా హిల్స్, హైదరాబాద్-500034, తెలంగాణ.
టెలిఫోన్: +91 40 3980 4333; **ఫ్యాక్స్:** +91 040 3980 4320,
ఇ-మెయిల్: secretarial@lauruslabs.com; వెబ్‌సైట్: www.lauruslabs.com

ప్రకటన

కంపెనీచే తేది.01 మే, 2025నాటి 'నోటీసు ఆఫ్ రికార్డు డేట్'కు తదుపరిగా, తేది.09 మే,2025 రికార్డు తేదీతో ఆర్థిక సంవత్సరం 2024-25 కొరకు రూ.2/- చొప్పున ముఖ విలువగల వాటాకు రూ.0.80 పైసలు చొప్పున 2వ మధ్యంతర డివిడెండ్ ప్రకటనను అనుసరించి, వాటాదారులకు ఇందుమూలముగా తెలియజేయబడినది ఏమనగా ఆర్థిక చట్టం, 2020 ద్వారా సవరించబడిన ఆదాయపు పన్ను చట్టం, 1961 (చట్టం) ప్రకారం 01 ఏప్రిల్, 2025 తర్వాత ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.10,000/- లేదా అంతకంటే ఎక్కువ మొత్తంలో కంపెనీ చెల్లించిన లేదా పంపిణీ చేసిన డివిడెండ్ వాటాదారుల చేతుల్లో పన్ను విధించబడుతుంది చట్టంలోని నిబంధనల ప్రకారం వాటాదారులకు కంపెనీ చెల్లించే డివిడెండ్ నుండి మూలం వద్ద పన్ను (టిడిఎస్) తీసివేయవలసి ఉంటుంది.

వివిధ వర్గాలకు టిడిఎస్ యొక్క నిర్దేశిత రేట్లు మరియు డిక్లరేషన్ల ప్రక్రియ క్రింది విధంగా ఉన్నాయి:

1) రెసిడెంట్ షేర్‌హోల్డర్

వివరములు	టిడిఎస్ రేటు
పాన్ తో	10% లేదా భారత ప్రభుత్వం ద్వారా గుర్తించినట్లుగా
పాన్ లేకుండా / చెల్లని పాన్	20% లేదా భారత ప్రభుత్వం ద్వారా గుర్తించినట్లుగా
ఫారమ్ 15జి లేదా ఫారమ్ 15హెచ్ లో డిక్లరేషన్ సమర్పణ	NIL

పై ప్రయోజనం కోసం, వాటాదారులు తక్కువ టిడిఎస్ రేటు ప్రయోజనం పొందుటకు డిపాజిటరీ పార్టిసిపెంట్స్ వద్ద వారి పాన్ అప్‌డేట్ చేసుకోవాలి మరియు వాటాదారులకు టిడిఎస్ సర్టిఫికెట్లను అందించడానికి కంపెనీకి వీలవుతుంది.

2) నాన్-రెసిడెంట్ షేర్‌హోల్డర్

టిడిఎస్ రేటు @20% మరియు వర్తించే సర్‌చార్జ్ మరియు సెస్ లేదా భారతదేశం మరియు వారి నివాస దేశం మధ్య ద్వంద్వ పన్ను ఎగవేత ఒప్పందం (డిటిఏఏ) కింద వర్తించే పన్ను ఒప్పంద రేటు (ఏది తక్కువ అయితే అది) క్రింది అవసరాలు నెరవేర్చుటకు లోబడి ఉంటుంది:

మే 11, 2025లోపు లేదా అంతకు ముందు secretarial@lauruslabs.com కి ఇమెయిల్ పంపడం ద్వారా పన్ను ఒప్పంద ప్రయోజనాలను పొందేందుకు ఈ క్రింది పత్రాలను అందించాల్సిందిగా నాన్-రెసిడెంట్ వాటాదారులను అభ్యర్థించడం జరిగింది.

- **భారతదేశంలో "నో పర్మినెంట్ ఎస్టాబ్లిష్మెంట్" కోసం డిక్లరేషన్;**
- **ప్రయోజనకరమైన యాజమాన్య ప్రకటన;**
- **2023 సంవత్సరానికి ట్యాక్స్ రెసిడెన్సీ సర్టిఫికెట్ (టిఆర్‌సి);**
- **ఫారం 10 ఎఫ్ మరియు**
- **భారతీయ పాన్ యొక్క కాపీ (అందుబాటులో ఉంటే).**

తదుపరిగా, డివిడెండ్ మొత్తం స్వీకరించుటకు వాటాదారులు వారి ఇమెయిల్ ఐడిలు మరియు/లేదా బ్యాంకు ఖాతా వివరాలను, వారి సంబంధిత డిపాజిటరీ పార్టిసిపెంట్స్‌తో నమోదుచేయనిచో వారిని ఇందుమూలంగా వారి సంబంధిత డిపాజిటరీ పార్టిసిపెంట్స్‌తో వారి ఇమెయిల్ ఐడిలు మరియు బ్యాంకు ఖాతా వివరాలను నమోదు/అప్‌డేట్ చేసుకోవాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

ఇంకాను, ఈ నోటీసు కంపెన యొక్క వెబ్‌సైట్: www.lauruslabs.com లో కూడా అందుబాటులో ఉంది.

లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ కోసం
సం/-
జి. వెంకటేశ్వర రెడ్డి
కంపెనీ సెక్రటరీ

ప్రదేశం: హైదరాబాద్
తేదీ: 08 మే, 2025

విద్యా వైద్యానికి పెద్దపీట

- వైద్యంపై ఏటా రూ.11,482 కోట్లు ఖర్చు
- రూ.11,600 కోట్లతో సమీకృత గురుకులాలు
- గత ప్రభుత్వం కంటే మిన్నగా విద్యావైద్యంపై వ్యయం
- ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాల శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రులు

శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు భట్టి, రాజనర్సింహ, తుమ్మల, పొంగులేట

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మానవ వనరుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, దానిలో భాగంగానే విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గత ప్రభుత్వం 2014 నుంచి 2024 వరకు సంవత్సరానికి సరాసరి వైద్యంపై రూ.5,959 కోట్లు ఖర్చు చేస్తే.. 2024- 25 ఏడాది కాలంలోనే ప్రజా ప్రభుత్వం రూ.11,482 కోట్లకు పైగా ఖర్చు చేసినట్టు తెలిపారు. గురువారం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండల కేంద్రంలో రూ.130 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణానికి మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో భట్టి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది కొత్త వైద్య కళాశాలలకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, భవనాలను నిర్మిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం కంటే అధికంగా ప్రజా ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ. ఐదు లక్షల నుంచి రూ.పది లక్షలకు పెంచడం వల్ల 90 లక్షల కుటుంబాలకు లబ్ది చేకూరుతోందని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు వైద్య కళాశాల ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. తమ ప్రభుత్వం వైద్యంతో పాటు విద్యకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. డైట్ చార్జీలు 40 శాతం, కాస్మోటిక్స్ చార్జీలు 200 శాతం పెంచినట్టు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో 58 యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను మొదటి దఫా మంజూరు చేసి రూ.11,600 కోట్లతో నిర్మాణాలు చేపట్టామన్నారు. మెడికల్ కాలేజీకి అనుసంధానంగా సూపర్ స్పెషాలిటీ వైద్యం ప్రజలకు ఉచితంగా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. వైద్య కళాశాల నిర్మాణానికి అవసరమైన భూమి, నిధుల సేకరణలో జిల్లా మంత్రులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఖమ్మం జిల్లాకు సాగునీరు అందించేందుకు సీతారామ ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తున్నామని, రు.100 కోట్ల ఖర్చుతో రాజీవ్ లింక్ కెనాల్ నిర్మించి నాగార్జునసాగర్ ఆయకట్టు స్థిరీకరణ చేశామన్నారు. గిరిజన కుటుంబాలకు రూ.12,500 కోట్లతో ఇందిరా గిరిజన వికాసం పథకం కింద ఆర్వోఎఫ్ఆర్ పట్టాలకు సోలార్ పంప్ సెట్లు, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింకర్లను అందిస్తున్నామని వివరించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ, దుబారా ఖర్చులు చేయకుండా ఉద్యోగులకు 1వ తేదీన జీతాలు ఇస్తున్నామని, ఉద్యోగస్తుల అవసరాలను కూడా ప్రభుత్వం భవిష్యత్తులో తీరుస్తుందని చెప్పారు.

మానవ వనరుల అభివృద్ధే లక్ష్యం: మంత్రి తుమ్మల

మానవ వనరుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ప్రభుత్వ వైద్యశాలలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాలలు కూడా మంజూరు అవుతున్నాయని, ఖమ్మం జిల్లాకు కూడా ఆ రకంగా మంజూరు చేయాలని కోరారు. ఖమ్మం జిల్లా ఆస్పత్రి మరింత విస్తరించాలని, అవసరమైన వైద్య పరికరాలు సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు. అమరావతి-నాగపూర్ గ్రీన్ ఫీల్డ్ హైవే పక్కన వైద్య కళాశాల వస్తుందని, సంవత్సర కాలంలో దీని నిర్మాణ పనులు పూర్తిచేసి తరగతులు ఇక్కడి నుంచి కొనసాగిస్తామని తెలిపారు.

రూ.4,100 కోట్లతో రీజినల్ క్యాన్సర్ సెంటర్ : మంత్రి రాజనర్సింహ

రూ.4,100 కోట్ల ప్రపంచ బ్యాంకు నిధుల నుంచి రూ.37 కోట్లతో రీజనల్ క్యాన్సర్ సెంటర్ వరంగల్‌కు, ఆర్బన్ రిట్రీవల్ సెంటర్ ఖమ్మం జిల్లాకు మంజూరు చేయనున్నట్టు వైద్యారోగ్య శాఖ మంత్రి సి. దామోదర రాజనర్సింహ ప్రకటించారు.

ఖమ్మం జిల్లాకు ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరు చేశామన్నారు. వరంగల్, ఖమ్మం, కరీంనగర్ ప్రజలు హైదరాబాద్‌పై ఆధారపడకుండా సూపర్ స్పెషాలిటీ సదుపాయాలు కల్పించాలనే ఉద్దేశంతో ఎన్‌సీడీ రోగుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా ప్రతి జిల్లాకు మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ సమకూర్చుతున్నామని అన్నారు. ఖమ్మంలో వ్యాస్కులర్ యాక్సిస్ సెంటర్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఎమర్జెన్సీ రెస్పాన్స్ టైమ్‌ను 18 నుంచి 14 నిమిషాలకు తగ్గించేందుకు నూతనంగా 213 అంబులెన్స్‌లు ప్రారంభించామని, దీన్ని 11 నిమిషాలకు తగ్గించే ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

ప్రత్యేకంగా ఏజెన్సీ మండలాల్లో 2 అంబులెన్స్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మిడ్ వైఫరీ కోర్సులు అందించేందుకు కృషి చేస్తామని, వీటి ద్వారా సీ సెక్షన్ డెలీవరీలు తగ్గుతాయని అన్నారు. రాష్ట్రంలో జాతీయ, స్టేట్ రహదారులపై సుమారు 90 ట్రామా సెంటర్‌లను ఏర్పాటు చేస్తున్నామని, బ్లాక్ స్పాట్ వద్ద ప్రతి 35 కి.మీకు ఒక ట్రామా సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వం వచ్చాక వైద్యశాఖలో సుమారు ఎనిమిది వేల పోస్టులు భర్తీ చేశామని అన్నారు.

ఆర్థిక ఇబ్బందులున్నా విద్యావైద్యానికి లోటు లేకుండా.. : మంత్రి పొంగులేటి

ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా విద్యా వైద్యానికి లోటు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం బకాయిలు రూ.1000 కోట్లు చెల్లిస్తూ వైద్య శాఖలో నూతన ఆస్పత్రులు, వైద్య, నర్సింగ్ కళాశాలలు వంటి ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, రాందాస్‌నాయక్, వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు డా.నరేంద్ర కుమార్, టిజి ఎంఐడిసి ఎండి ఫణిందర్ రెడ్డి, ఖమ్మం నగర మేయర్ నీరజ, డిసిసిబి చైర్మన్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, జడ్‌పి సిఇఒ దీక్షా రైనా, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా రాజేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా బి కళావతి బాయి, ఆర్అండ్‌బి ఎస్ఇ యాకూబ్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులకు జాబ్ గ్యారంటీ శిక్షణ

- మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

యువతకు నైపుణ్య శిక్షణనిచ్చి సాఫ్ట్ వేర్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించే మరో కొత్త కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు 'ప్లేస్ మెంట్ సక్సెస్ ప్రోగ్రాం' కింద ఐదు నెలల శిక్షణనిచ్చి ఉద్యోగాలకు సంసిద్ధులుగా తీర్చిదిద్దేందుకు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అయాన్ (టిసిఎస్ఐఒఎన్) ముందుకొచ్చిందని తెలిపారు. గురువారం సచివాలయంలో మంత్రి సమక్షంలో హైదరాబాద్ జెఎన్‌టియు, టిసిఎస్ ఐయాన్ సంస్థల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. అనంతరం శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఇంజినీరింగ్ చేసినా వారిలో నైపుణ్యం లేకపోవడంతో ఉద్యోగాలు దొరకడం కష్టంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం స్కిల్ ఇండియా యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 'సాంకేతిక నైపుణ్యాలు లేకుండా డిగ్రీలతో ఉద్యోగాలు రావడం కష్టం. చదువు పూర్తి చేసే సమయానికి ప్రతి ఒక్కరికీ ఏదో ఒక అంశంలో నైపుణ్యం పెంచగలిగితే ఉద్యోగాలు ఇవ్వడం కోసం కంపెనీలు వాటికవే పరుగెత్తుకుంటూ వస్తాయి. టీసీఎస్ ఐయాన్ సంస్థ మొదటి దశలో ప్రతి ఐదు నెలల(20 వారాల)కు వంద మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలకు సిద్ధం చేస్తుంది. ఆ సంస్థతో సంబంధం కలిగిన మూడు వేలకు పైగా కంపెనీలు వీరిలో ప్రతిభావంతులను ఎంపిక చేసుకుని ఉద్యోగాలు కల్పిస్తాయి. పైలట్ కార్యక్రమం కింద మంథనిలోని జేఎన్‌టీయూ కళాశాల విద్యార్థులకు ప్లేస్ మెంట్ సక్సెస్ ప్రోగ్రాం కింద నైపుణ్య శిక్షణకు ఎంపిక చేస్తాం" అని శ్రీధర్ బాబు వెల్లడించారు. గ్రామీణ ప్రాంత యువతను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగ సంసిద్ధత కార్యక్రమాలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. అవగాహన ఒప్పంద కార్యక్రమంలో టిసిఎస్ ఐయాన్ గ్లోబల్ హెడ్ వెంగుస్వామి, స్కిల్ ఎడ్యుకేషన్ బిజినెస్ హెడ్ స్మృతి ముల్యే, జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ టి కిషన్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ఐటి సలహాదారు సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫాసిజం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా

నేడు రాష్ట్రంలో సభలు, సెమినార్లు : జాన్‌వెస్లీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హిట్లర్ ఫాసిజాన్ని 1945 మే తొమ్మిదిన సోవియట్ యూనియన్, కమ్యూనిస్టు పార్టీల ఎర్రసైన్యం ఓడించిందని సిపిఎం రాష్ట్ర కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా ఫాసిజం, సామ్రాజ్యవాద ధోరణులకు వ్యతిరేకంగా, శ్రామికవర్గ పోరాటాలను ఉధృతం చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా సభలు, సెమినార్లను నిర్వహించాలని సిపిఎం కేంద్రకమిటీ పిలుపునిచ్చిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో శుక్రవారం సభలు, సెమినార్లను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులు, పాలకవర్గాలు హిట్లర్ నాజీయిజాన్ని పొంచి పోషించాయని తెలిపారు. భూగోళంలో కమ్యూనిజాన్ని లేకుండా చేస్తాడని ఆయనను ప్రోత్సహించి రష్యా, సోవియట్ యూనియన్ మీద దాడి చేయించడానికి పూనుకున్నాయని వివరించారు. స్టాలిన్ నాయకత్వాన కోట్లాది మంది సోవియట్ యూనియన్ ప్రజలు, సైన్యం తిరుగుబాటు చేసి ప్రాణాలర్పించారని పేర్కొన్నారు. 30 లక్షల కమ్యూనిస్టు కార్యకర్తలు ప్రాణాలొడ్డి, ఫాసిజాన్ని ఓడించి జర్మనీలోని బెర్లిన్ నగరానికి హిట్లర్‌ను తరిమికొట్టి అక్కడ ఎర్రజెండా ఎగురవేశారని తెలిపారు. అందువల్ల ఇప్పటికీ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటాలను సాగించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. గతనెలలో 91 కమ్యూనిస్టు పార్టీలు రష్యాలో సమావేశమై సామ్రాజ్రవాదం, ఫాసిజానికి వ్యతిరేకంగా భవిష్యత్‌లో పోరాటాలను ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించాయని తెలిపారు. కార్మిక పోరాటాలు పెరుగుతున్న నేపథ్యంలో ఫాసిస్టు ధోరణులు వస్తున్నాయని పేర్కొన్నారు. ఆనాడు సోవియట్‌లో విప్లవం విజయవంతమైన తర్వాత దాన్ని ఓడించడానికి ఫాసిజాన్ని ముందుకు తీసుకొచ్చారని తెలిపారు. భారత్‌లో కూడా ఇలాంటి ఫాసిస్టు ధోరణులకు వ్యతిరేకంగా శ్రామిక వర్గాన్ని, ప్రజలను చైతన్యం చేస్తూ, శ్రామికవర్గ పోరాటాలను ముందుకు తీసుకెళ్లాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బైక్‌ను ఇసుక లారీ ఢీకొట్టగా.. వ్యక్తి మృతిచెందిన సంఘటన జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాటారం పోలీస్‌స్టేషన్ పరిధి 353 జాతీయ రహదారిపై చింతకాని క్రాస్ రోడ్ వద్ద గురువారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటారం మండలం ధన్వాడ గ్రామానికి చెందిన తుల్సెగారి రాజలింగు (55) ఓ వివాహానికి హాజరై తిరిగి బైక్‌పై ఇంటికి వెళుతున్నారు. చింతకాని క్రాస్ రోడ్ వద్ద పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన బారికేడ్ల వద్ద వరంగల్ వైపు వెళ్తున్న ఇసుక లారీ బైక్‌ను ఢీ కొట్టింది. దాంతో రాజలింగు రోడ్డుపై కింద పడి అక్కడికక్కడే మృతిచెందారు. కాగా, లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. కాటారం ఎస్ఐ మ్యాకల అభినవ్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుని కుమారుడు రామక్రిష్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. అడ్డూఅదుపులేని ఇసుక లారీల రవాణాతో ప్రమాదాలు జరుగుతుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రైతు అనుకూల విధానాలు అనుసరించాలి

- లేకపోతే దేశానికి ఆహార భద్రత ఉండదు
- మోడీ క్షమాపణలు చెప్పారు కానీ గిట్టుబాటు ధర కల్పించలేదు
- ఎఐయుకెఎస్ ధర్నాలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"దేశంలో రైతు అనుకూల విధానాలు అనుసరించకపోతే ఆహార ముప్పు ఏర్పడుతుంది.. సాగు వ్యతిరేక నల్ల చట్టాలకు వ్యతిరేకంగా అన్నదాతలు రెండేళ్లు పోరాటం చేశాక దిగొచ్చిన ప్రధాని మోడీ క్షమాపణలు చెప్పారు కానీ.. పంటలకు గిట్టుబాటు ధరలు మాత్రం కల్పించడం లేదు.. రైతులు చనిపోతున్నా చలించడం లేదు.." అని పలువురు వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు అనుకూల విధానాలు అనుసరించాలని లేకుంటే దేశానికి ఆహార భద్రత ఉండదని తెలిపారు. ఎఐయుకెఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్, ధర్నాచౌక్ వద్ద గురువారం రైతు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ ఆర్థిక నిపుణులు డి పాపారావు మాట్లాడుతూ.. పాలకుల తప్పుడు విధానాలతో వ్యవసాయ రంగం సంక్షోభం ఎదుర్కొంటోందని చెప్పారు. స్వామినాథన్ కమిషన్ ప్రతిపాదనలకు అనుగుణంగా సమగ్ర పంటల ఖర్చు ప్రతిపాదికన రైతు పండించిన పంటలన్నిటికీ కనీస మద్దతు ధరలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కనీస మద్దతు ధరపై కేంద్రం చట్టం చేయాలని కోరారు. కార్పొరేట్ అనుకూల జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. రైతులు బాగుంటేనే కొనుగోలు శక్తి పెరుగుతుందని చెప్పారు.

మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో 2006 అటవీ హక్కుల చట్టం అమలు చేయాలన్నారు. సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వడం లేదని, సాగులో ఉన్న గిరిజన, గిరిజన ఇతర ప్రజలందరికీ చట్టం ప్రకారం పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ అనుకూల గ్రామీణ సూపర్ రిచ్ విధానాలను ఓడించడానికి దేశవ్యాప్తంగా ఐక్య ఉద్యమం కోసం రైతులందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఎఐకెఎస్ రాష్ట్ర అధ్యక్షులు కెచ్చెల రంగారెడ్డి మాట్లాడుతూ.. రైతులకు వడ్డీ లేని రుణాలు, విత్తనాలు, ఎరువులు, సకాలంలో సరఫరా చేయాలని, అటవీ హక్కుల చట్టం 2006 సమగ్రంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. చిన్న, సన్నకారు, మధ్యతరగతి రైతులకు పూర్తిగా రుణమాఫీ చేయాలన్నారు. అన్ని వ్యవసాయ ఉత్పత్తులకూ ఎంఎస్‌పి కోసం చట్టపరమైన హామీ ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పల ప్రభాకర్ మాట్లాడుతూ.. పాలకులు కనీస మద్దతు ధరలను ఇష్టం వచ్చినట్టు నిర్ణయిస్తుండటం వల్ల రైతులు నష్టపోతున్నారన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం సమగ్ర ఖర్చుల మీద 50 శాతం లాభం కలిపి పంటలకు ధరలు నిర్ణయిస్తే రైతు ఆదాయాలు పెరుగుతాయని తెలిపారు. ఈ ధర్నాలో ఎఐయుకెఎస్ ఉపాధ్యక్షులు డి.రాము, రాష్ట్ర సహాయ కార్యదర్శి నంది రామయ్య, చిన్న చంద్రన్న, బిక్షం అన్న, దేవరాం, సురేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల పట్ల సిఎం రేవంత్ తీరు గర్హనీయం

- సర్కారుకు తొత్తులుగా టిఎన్‌జిఒ సంఘాలు
- ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం
- 20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి : శ్రీకుమార్

సెమినార్‌లో మాట్లాడుతున్న శ్రీకుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉద్యోగుల పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహరించిన తీరు గర్హనీయమని ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీకుమార్ విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "ప్రభుత్వ ఉద్యోగుల సెమినార్"లో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల ముందిచ్చిన ఏ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని అన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజ్, పెండింగ్ బకాయిలు, డీఏల చెల్లింపు విషయంలో డబ్బుల్లేవంటూ సిఎం స్థాయిలో ఉన్న వ్యక్తి వ్యంగంగా చేసిన వ్యాఖ్యలు ఉద్యోగుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల దేశంలో పబ్లిక్ రంగం కుదేలైందని ఆందోళన వ్యక్తం చేశారు. టాటా, అదాని, అంబానీ లాంటి కార్పొరేట్లకు ప్రభుత్వ రంగ సంస్థలను కట్టబెట్టేందుకు మోడీ సర్కార్ కుట్రలు పన్నుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 1991లో ప్రధానిగా ఉన్న పివి తెచ్చిన ఆర్థిక సంస్కరణలను ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలు కొనసాగిస్తున్నాయని చెప్పారు. కేంద్రం అనుసరిస్తున్న సరళీకృత ఆర్థిక విధానాలను కేరళ లాంటి కొన్ని రాష్ట్రాలు మినహా అందరూ అమలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీలను కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేస్తున్నారని విమర్శించారు. దేశంలో అతి పెద్ద ప్రభుత్వం రంగ సంస్థ అయిన రైల్వేలో 6లక్షల ఖాళీలున్నాయని గుర్తు చేశారు. తెలంగాణతో పాటు బిజెపి పాలిత రాష్ట్రాలన్నీ పబ్లిక్ సర్వీస్ కమిషన్లను నిర్వీర్యం చేశాయని చెప్పారు. కేరళలో మాత్రం ప్రభుత్వ రంగంలో ఖాళీ అయిన పోస్టును అక్కడి పబ్లిక్ సర్వీస్ కమిషన్ 90 రోజుల్లోనే భర్తీ చేస్తుందని అన్నారు. ఈ నెల 20న చేపట్టిన సార్వత్రిక సమ్మెలో అన్ని సంఘాలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సిఐటియు కార్యదర్శి జె వెంకటేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పబ్లిక్ సెక్టార్లన్నింట్లో రెగ్యులర్ ఉద్యోగులు పదవి విరమణ పొందిన తర్వాత వారి స్థానంలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను భర్తీ చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ ఆయిన సింగరేణిలో ఒకప్పుడు 1.2లక్షల మంది ఉద్యోగులుండే వారనీ, ప్రస్తుతం వారి సంఖ్య 40 వేలకు పడిపోయిందని గుర్తు చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు తామే ప్రతినిధులమని చెప్పుకునే కొన్ని సంఘాలు ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వానికి తొత్తులుగా మారి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవులకు అమ్ముడుపోతున్నాయని విమర్శించారు. టాప్రా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.కృష్ణమూర్తి మాట్లాడుతూ పెన్షనర్లు దాచుకున్న సొంత డబ్బును పొందడానికి కూడా ఏళ్ల తరబడి ఎదురు చూడాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మహ్మద్ ఫసియొద్దీన్, ప్రధాన కార్యదర్శి కె.యాదానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు పెంచాలి

- తెలంగాణ మీ సేవ ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కనీస వేతనాలు పెంచాలనీ, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ మీ సేవ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఆ సంఘం గౌరవాధ్యక్షులు జె వెంకటేశ్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ సురేష్, జెనీమా, కోశాధికారి ఎవిబి లక్ష్మి, ఉపాధ్యక్షులు బాలరాజ్, సహాయ కార్యదర్శి కవితతో కూడిన ప్రతినిధి బృందం ఐటి ముఖ్యకార్యదర్శి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ మీ-సేవా కేంద్రాలు అద్భుతంగా పనిచేస్తున్నాయనీ, ప్రజలకు అనేక సేవలను అందించడంలో ప్రశంసనీయ పాత్ర పోషిస్తుందని సీఎం, ఐటీ శాఖామాత్యులు పలు సార్లు చెప్పారని గుర్తు చేశారు. మీ-సేవా సర్వీసుల్లో ప్రజల సౌకర్యం కోసం ప్రవేశపెడుతున్న అనేక సేవల వల్ల పని భారం పెరుగుతున్నప్పటికీ పట్టుదలగా శ్రమిస్తున్నామని తెలిపారు. అయినప్పటికీ గత రెండేళ్ల నుంచి కనీస వేతనాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రేక్ లేకుండా పీఎఫ్ ఖాతాలు కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. వార్షిక బోనస్ లేదా ఇన్సెంటివ్ కూడా చెల్లించలేదని తెలిపారు. హెల్త్ ఇన్సూరెన్స్ స్కీముకు సంబంధించిన విధివిధానాలు రూపొందించడం లో ఆలస్యం జరుగుతున్నదని పేర్కొన్నారు. అదే సమయంలో పెరుగుతున్న పని భారం, సమస్యలు కూడా పరిష్కారం కాకపోవడంతో సిబ్బంది అసంతృప్తిగా ఉన్నారని గుర్తు చేశారు. ఇటీవల ఎపిఎఎఆర్ (చిన్న పిల్లలకు ఆధార్ కార్డులు దరఖాస్తు), రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, విద్యార్థులకు ప్రత్యేకంగా మున్సిపల్ సేవలకు సంబంధించిన బర్త్ సర్టిఫికెట్లలో సవరణలు తదితర సేవలతో మీ-సేవా సిబ్బందికి మోయలేనంత పని భారం పెరిగిందని తెలిపారు. 2024 పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత జూలై నెల నుండి యూనియన్ నాయకత్వం పలు దఫాలుగా కలిసి తమ సమస్యలను వివరించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో మీ-సేవా సిబ్బంది న్యాయమైన సమస్యలను తక్షణం పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. పెరిగిన పనికి తగిన విధంగా అదనపు సిబ్బందిని పెంచాలని కోరారు. ఆ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు మెరుగు పర్చాలనీ, రూ. 10లక్షలు హెల్త ఇన్సూరెన్స్ స్కీమ్ వెంటనే అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వార్పిన్ కార్మికులు

చీరల కూలి పెంచండి..

- సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట వార్పిన్ కార్మికుల ధర్నా
- సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వం ఉత్పత్తి చేయిస్తున్న మహిళా సంఘాల చీరలకు కూలి పెంచాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో వార్పిన్ కార్మికులు చేపట్టిన సమ్మె మూడో రోజుకు చేరుకుంది. అందులో భాగంగా గురువారం కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సిరిమల్ల సత్యం మాట్లాడుతూ.. ప్రభుత్వం చీరల ధర పెంచినా యజమానులు కూలి పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంటనే యజమానులతో చర్చలు జరిపి కార్మికుల కూలి పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఉడుత రవి, మచ్చ వేణు, బూట్ల వెంకటేశ్వర్లు, ఐరేని ప్రవీణ్, అవధూత హరిదాసు, ఆడిచర్ల రాజు, కార్మికులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి మృతి

- పలువురి నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ ఉప్పల్ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు బండారి రాజిరెడ్డి గురువారం మృతి చెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడ్డారు. హబ్సిగూడలోని నివాసంలో రాజిరెడ్డి భౌతికకాయానికి ఎమ్మెల్యేలు, పలువురు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ఆయన నివాళులర్పించారు. మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యేలు కెపి వివేకానంద, దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కందాల ఉపేందర్ రెడ్డి, సుభాష్ రెడ్డి, కార్పొరేటర్లు, పలువురు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి కుటుంబ సభ్యులు, సోదరుడు.. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని పరామర్శించారు. బండారు రాజిరెడ్డి గతంలో కాప్రా మున్సిపల్ చైర్మన్‌గా, టిటిడి బోర్డు మెంబర్‌గా పని చేశారు. 2009 నుంచి 2014 వరకు ఎమ్మెల్యేగా పని చేశారు. ఆయన అంత్యక్రియలు గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించారు.

సత్తుపల్లిలో ఎస్‌బిఐ లైఫ్ కొత్త శాఖ ఏర్పాటు

హైదరాబాద్ : ప్రయివేటు రంగ బీమా సంస్థ ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ తెలంగాణలో కొత్త బ్రాంచ్ ఆఫీస్ ప్రారంభించినట్లు తెలిపింది. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో కొత్త శాఖ ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. దీనిని ఆ సంస్థ రీజనల్ డైరెక్టర్ అభిషేక్ కర్ మజుందార్ లాంచనంగా ప్రారంభించారు. 2047 నాటికి అందరికీ బీమా కల్పించాలన్న ఐఆర్‌డిఎఐ లక్ష్యానికి అనుగుణంగా ఈ విస్తరణ తోడ్పడనుందని మజుందార్ పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో తమకు 54 శాఖలున్నాయని తెలిపారు.

వియత్నాంకు విమానం

శంషాబాద్ నుంచి హనోయ్‌కి సర్వీసులు ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్జీఐఏ) నుంచి వియత్నాం రాజధాని హనోయ్‌కు నేరుగా విమానసేవలు ప్రారంభమయ్యాయి. ఆమేరకు జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీహెచ్ఐఏఎల్) ఈ సేవలకు శ్రీకారం చుట్టినట్టు గురువారం ప్రకటించింది. వియత్నాం ఎయిర్‌లైన్స్ 7 మే 2025 నుంచి ఈ నూతన సేవలను అందిస్తున్నది. హనోయ్‌లోని నోయ్ బాయ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి బయలుదేరే విమానం (విఎన్-984) ప్రతి ఆదివారం, బుధవారం, శుక్రవారం రాత్రి 11:45 గంటలకు హైదరాబాద్ నుంచి బయిలుదేరుతుంది. కాగా హనోయ్ స్థానిక సమయం ఉదయం 5:25 గంటలకు చేరుకుంటుంది. తిరిగి హనోయ్ నుంచి బయలుదేరే విమానం(విఎన్-985) అక్కడి సమయం సాయంత్రం 7:15 గంటలకు బయలుదేరి, ఇక్కడి సమయం రాత్రి 10:15కి హైదరాబాద్ చేరుకుంటుంది.

INTERNATIONAL INSTITUTE OF INFORMATION TECHNOLOGY HYDERABAD
Viswam.AI
Swecha

ఎఐపై విద్యార్థులకు శిక్షణ

- విశ్వం ఎఐ సెంటర్ హెడ్ కిరణ్ చంద్ర వెల్లడి
- తెలుగు ఎల్ఎల్ఎం రూపొందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - హైదరాబాద్

ఇంజనీరింగ్ విద్యార్థులకు కృత్రిమ మేధపై నైపుణ్యం కల్పించడమే లక్ష్యంగా 'సమ్మర్ ఆఫ్ ఏఐ' శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విశ్వం.ఏఐ సెంటర్ హెడ్, కిరణ్ చంద్ర తెలిపారు. శత సహస్ర యాగం అనే ఈ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ నెల రోజుల పాటు జరగనుందన్నారు. ఇది ప్రపంచంలో మొట్టమొదటి తెలుగు లార్జ్ లాంగ్వేజ్ మోడల్ (ఎల్ఎల్ఎం) అభివృద్ధికి తోడ్పాటు అందించనుందన్నారు. దీని ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ఉన్న లక్ష మందికి పైగా ఇంజినీరింగ్ విద్యార్థులకు లబ్ధి చేకూరనుందన్నారు. ఐఐఐటి హైదరాబాద్, స్వేచ్ఛ, మెటా, హెచ్వైఎస్ఈఏ, ఒజోనెటెల్ తదితర సంస్థల సహకారంతో ఇది రూపుదిద్దుకుందన్నారు. విద్యార్థులు ఏఐ/ఎంఎల్ ప్రాథమికాంశాలు, డేటా ప్రిపరేషన్, మోడల్ బిల్డింగ్, డిప్లాయ్మెంట్ వంటి అంశాలలో నైపుణ్యం పొందుతారన్నారు. ఈ హైబ్రిడ్ (ఆన్‌లైన్, ఆఫ్‌లైన్) కోర్సు ద్వారా విద్యార్థులు తెలుగు ఎల్ఎల్ఎం అభివృద్ధిలో భాగస్వాములవుతారన్నారు. ఇందులో డేటా సేకరణ, డేటా క్యూరేషన్, ఇండిక్ (తెలుగు) డేటాసెట్ నిర్మాణం, ఆపై ఆ డేటా ఆధారంగా విద్యార్థులు ఏఐ మోడల్ అభివద్ధిని సమగ్రంగా నేర్చుకుంటారని తెలిపారు.